క్లుప్తంగా

బ్యూటీషిన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

చీరాల టౌన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్‌లో మహిళలకు ప్రత్యేకంగా బ్యూటీషిన్ సర్టిఫికెట్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ అందిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసి 35 ఏళ్లలోపు మహిళలు కోర్సులో చేరేందుకు అర్హులని, కోర్సులో చేరే మహిళలు ఆధార్‌కార్డు, ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు స్కిల్ హబ్ సెంటర్ కో–ఆర్డినేటర్ 85559 01193 సంప్రదించాలన్నారు.

శనగ కొనుగోలు కేంద్రాలతో లాభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కృష్ణచైతన్య

మేదరమెట్ల: రైతులు పండించిన శనగ పంటను గిట్టుబాటు ధరకు విక్రయించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం శనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. కొరిశపాడు మండలంలోని రావినూతల సొసైటీ భవనం వద్ద శనివారం శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, సర్పంచ్ విజయవాణి, సొసైటీ కార్యాలయ సిబ్బంది, నాయకులు, పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

పది పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

చినగంజాం: పదో తరగతి పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఎంఈవో డీ గంగాధర్ తెలిపారు. మండలంలోని చినగంజాం, కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. చినగంజాం పరీక్ష కేంద్రంలో 243 మంది, కడవకుదురు పరీక్ష కేంద్రంలో 169 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఇంకొల్లు మండలంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, మొత్తం 895 మంది రెగ్యులర్, 14 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు ఎంఈవో ఎంవీ సత్యనారాయణ తెలిపారు.

ఒత్తిడిని జయిస్తే పదిలో మంచి ఫలితం



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న సభ్యులు

చీరాల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థులకు భయం వద్దు.. ఒత్తిడి లేకుండా రాసి మంచి మార్కులు సాధించాలని తాడివలస దేవరాజ్ సూచించారు. శనివారం పేరీరా స్కూల్లో పది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బిరుదు కొల్లయ్య సహకారంతో పది విద్యార్థులకు ప్యాడ్లు, పరీక్ష సామగ్రి, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వేరోస్ ప్రధాన కార్యదర్శి కొల్లయ్య, ప్రిన్సిపాల్ సుప్రసన్న, ఉపాధ్యాయులు జయలక్ష్మీ, అలేఖ్య, తదితరులు ఉన్నారు.

వ్యర్థాలతో ఆదాయ వనరులు



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్డీ

బల్లికురవ: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాల్లో వ్యర్థాలతో పంచాయతీల్లో ఆదాయ వనరులు పెంచుకోవచ్చని ఈవోఆర్డీ సీతామహలక్ష్మీ అన్నారు. శనివారం అంబడిపూడి గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని, కొమ్మినేనివారిపాలెం గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. పరిశీలనలో సెక్రటరీలు జీ. గంగాధర్, పీఏఆర్ ఖాన్ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలి

బల్లికురవ: ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలు, సొంత స్థలాలకు మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చెయ్యాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం గుంటుపల్లి గ్రామంలో జగనన్న కాలనీలో అసంపూర్తిగా నిర్మాణ పనులు నిలిచి లబ్ధిదారులతో మాట్లాడారు. బిల్లు చెల్లింపులతో పాటు డీఆర్‌డీఏ ద్వారా పొదుపు గ్రూపు మహిళలకు రూ.35 వేలు చెల్లిస్తామని చెప్పారు. పరిశీలనలో గృహ నిర్మాణ శాఖ ఏఈ దుర్గా రమేష్, ఏపీఎం బీ. సురేంద్రబాబు, సెక్రటరీ కేవీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

త్రిపురాంతకం టు పొన్నూరు



బల్లికురవ మీదుగా వలస వెళ్తున్న ఆవులు



బల్లికురవ ప్రాంతంలో మేస్తున్న ఆవులు

- పశుగ్రాసానికి ఆవుల మందల వలస
- బల్లికురవ మీదుగా పయనం

బల్లికురవ: పశుగ్రాసం కోసం ఆవుల మందలు తరలివెళ్తున్నాయి. పచ్చిమేత కోసం ప్రకాశం జిల్లా త్రిపురాంతకం నుంచి బల్లికురవ మీదుగా ఆవుల మందలు బాపట్ల జిల్లా పొన్నూరు ప్రాంతానికి వలస వెళ్తున్నాయి. బాపట్ల, రేపల్లె, పొన్నూరు ప్రాంతాల్లో మాగాణి భూములు పచ్చిక బయళ్లు అధికంగా ఉండటంతో రెండు నెలలపాడు అక్కడ పశుగ్రాసానికి ఢోకాలేదని ఆవుల యజమానులు శనివారం సాక్షికి తెలిపారు. త్రిపురాంతకం ప్రాంతంలో పచ్చిమేత కొరతగా ఉందని, దీనిని అధిగమించేందుకు మే మాసాంతం వరకు పొన్నూరు ప్రాంతంలోనే కుటుంబాలతో బసచేస్తామని ఆవుల యజమానులు లక్ష్మణ్, సుబ్బయ్య తెలిపారు. మందలో 450 పై చిలుకు ఆవులు ఉన్నాయని, రహదారుల వెంట పగలు మేపుకుంటూ యద్దనపూడి, పర్చూరు, బాపట్ల మీదుగా పొన్నూరు వెళ్తామని చెప్పారు. తాత ముత్తాతల కాలం నుంచి ఆవులను పోషిస్తూ కుటుంబాలను వెళ్లదీస్తున్నామని, సంవత్సరంలో ఆరు నెలల పాటు పచ్చి మేత కోసం గ్రామాన్ని విడిచి వెళ్తున్నట్లు చెప్పారు

నాయీ బ్రాహ్మణుల అన్నదాన సత్రం పరిశీలన



అన్నదాన సత్రం వద్ద పూజ నిర్వహిస్తున్న ఆమంచి

చినగంజాం: ఇంకొల్లు మండలంలోని పావులూరు ఆంజనేయ స్వామి గుడి సమీపంలో నిర్మాణంలో ఉన్న నాయీ బ్రాహ్మణుల అన్నదాన సత్రాన్ని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ శనివారం సందర్శించారు. నిర్మాణంలో ఉన్న అన్నదాన సత్రాన్ని మండల సంఘపెద్దల ఆహ్వానం మేరకు ఆయన సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సత్రంలో నిర్మాణం జరుపుకుంటున్న గదులను, విశ్రాంతి భవనం గదులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్ తిరుపతిరాయుడు, బండ్ల వెంకట సుబ్బారావు, అడపా సుధాకరరెడ్డి, బండారు ప్రభాకరరావు, ధనుంజయరాజు, రామాంజి, ఇమ్రాన్, శివ, వెంకటరమణ, శ్రీను, సుబ్బారాయుడు, నగేష్, రావు, అంకారెడ్డి, మల్లేశ్వరి, ఆంజనేయులు పాల్గొన్నారు. అనంతరం పావులూరు గ్రామానికి చెందిన సొసైటీ ప్రెసిడెంట్ పీ రామకృష్ణారెడ్డి తల్లి అంజమ్మ ఇటీవల మరణించడంతో ఆయనతో పాటు కుటుంబ సభ్యులను ఆమంచి పరామర్శించారు. కార్యక్రమంలో సింహాద్రి సుబ్బారెడ్డి, భద్రాద్రి రెడ్డి, కుమార్ రెడ్డి, నాగిరెడ్డి, వెంకటరెడ్డి, మున్నంగి సుబ్బారెడ్డి, కోమటి గుంట నాగేశ్వరరావు, పురంశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవుల రక్షణ కోసమే ఏసుక్రీస్తు జననం



కారంచేడు నుంచి చీరాలకు బయలుదేరిన శిలువ యాత్రలో క్రైస్తవులు

కారంచేడు: మానవుల రక్షణ కోసమే ఏసుక్రీస్తు ఈ లోకంలో జన్మించి, శిలువ మరణం పొందారని లూర్దుమాత దేవాలయం చర్చి విచారణ గురువు ఫాదర్ గుణశేఖర్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రం కారంచేడు లూర్దుమాత దేవాలయంలో ఏర్పాటు చేసిన ఉపవాస ప్రార్థనల్లో పాల్గొని మాట్లాడారు. ఏసుక్రీస్తు ఈ లోకంలో జీవించిన కాలంలో 40 రోజులు శ్రమల కాలాన్ని అనుభవించారన్నారు. దీనికి సాదృశ్యంగా ప్రపంచ వ్యాప్తంగా శ్రమల దినాలను ఆచరిస్తుంటారన్నారు. దీనిలో భాగంగానే శనివారం కారంచేడు లూర్దుమాత దేవాలయానికి చెందిన సుమారు 350 మంది మహిళలు, క్రైస్తవులు, చిన్నారులు సైతం చీరాల పట్టణంలోని పునీత ఆంథోని దేవాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్లు ఏసురత్నం, తంబి, రత్నరాజు, సతీష్, దిలీప్‌లు పరిశుద్ధ దివ్యబలిపూజలు నిర్వహించారు. చీరాల, కారంచేడు, పర్చూరు మండలాలకు చెందిన వేలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. శిలువ యాత్రలో మహిళలు, చిన్నారులు ఆలపించిన పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

'రోటరీ సపోర్ట్ గంగ' అధ్యక్షుడిగా చంద్రశేఖరరావు

పర్చూరు: రోటరీ క్లబ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి సంబంధించిన 'సపోర్టు గంగ' నూతన అధ్యక్షునిగా పోలిశెట్టి చంద్రశేఖరరావు, కార్యదర్శి పాటోలు వెంకటేశ్వర్లు, ట్రెజరర్‌గా కాసా అశోక్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. సపోర్టు నిర్వహణలో భాగంగా పర్చూరు గంగ, నూతలపాడు గంగ, ఆదిపూడి గంగ వాటర్ ప్లాంట్ ద్వారా ప్రజలకు మంచినీరు అందిస్తున్నారు. ట్రస్ట్ అధ్యక్షుడిగా గడ్డిపాటి శ్రీనివాసరావు కార్యదర్శులుగా కె.నరేంద్రకుమార్ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు తెలిపారు.

చిరుధాన్యాలతో స్త్రీలకు పౌష్టికాహారం

మార్టూరు: చిరుధాన్యాలు, ఆకుకూరలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవడం వల్ల రక్తహీనత, కాల్షియం తదితర లోపాలను అధిగమించవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే పద్మ అన్నారు. బొల్లాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆమె స్థానిక మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె చిరుధాన్యాలతో మహిళలకు లభించే సూక్ష్మ పోషక పదార్థాలు, ఆరోగ్య సమస్యల పరిష్కారం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగారావు, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, సచివాలయ సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మ

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి



ఆర్డీవో సరోజినికి సూచనలు అందిస్తున్న ఎమ్మెల్యే కరణం

- ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల: రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి వచ్చే ప్రజలు, పనిచేసే ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా అన్నీ సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. శనివారం చీరాల ఆర్డీవో కార్యాలయానికి ఎమ్మెల్యే పరిశీలించారు. డివిజనల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సౌకర్యాలు, ప్రజలు వేచి ఉండేందుకు కావాల్సిన హాలు నిర్మాణం తదితర ఏర్పాట్లు త్వరగా కల్పిస్తామన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ బాపట్ల జిల్లా పరిధిలోని పెద్దదైన ఆర్డీవో కార్యాలయానికి నిత్యం ప్రజలు వివిధ రకాల అర్జీలపై కార్యాలయానికి వస్తుంటారని, అధికారులు, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించి సేవలను సత్వరం అందించాలన్నారు. ఆర్డీవో కార్యాలయ మరమ్మతులకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేయించి అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీవో పీ సరోజిని, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, తహసీల్దార్లు ప్రబాకరరావు, మహేశ్వరి, మున్సిపల్ అధికారులు రవి, శైలజ, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం



ట్రాఫిక్ పోలీసులతో కలిసి సూచనలు అందిస్తున్న డీఎం శ్యామల



అవగాహన కల్పిస్తున్న ఇంకొల్లు సీఐ సూర్యనారాయణ

చీరాల: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఆర్టీసీ డీఎం జంజనం శ్యామల సూచించారు. శనివారం చీరాల పట్టణంలోని రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లలో ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసులతో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు చేస్తున్న వాహనాలను నిలుపుదల చేసి ప్రమాదాలపై కౌన్సెలింగ్ అందించారు. ఈసందర్భంగా ఆర్టీసీ డీఎం మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన పత్రాలు, లైసెన్సులను అందుబాటులో ఉంచుకుని వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు. ప్రమాదాల వలన జరిగే నష్టాలను గురించి డ్రైవర్లకు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై సాల్మన్, ఏఎస్సై శ్యామ్యూల్, ఆర్టీసీ, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: వాహనదారులు ప్రయాణం కన్నా ప్రాణాలు ఎంతో ముఖ్యమని ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ సూచించారు. శనివారం నో ఆక్సిడెంట్ డే కార్యక్రమంలో భాగంగా సర్కిల్ పరిధిలోని ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో డీఎస్పీ పీ శ్రీకాంత్ పర్యవేక్షణలో సీఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంకొల్లు ఎస్సై ఎస్కే నాయబ్ రసూల్, చినగంజాం ఎస్సై కట్టా అనూక్, కారంచేడు ఎస్సై అనితలు తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గం రాజమార్గం

అద్దంకి: రాజీ మార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జి బాబూనాయక్ అన్నారు. మే నెల 13వ తేదీన కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శనివారం బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో సీనియర్ సివిల్ జడ్జి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌తో ఎక్కువ కేసులు రాజీ జరిగేలా న్యాయవాదులు చొరవ చూపాలన్నారు. క్షణికావేశంలో వివాదాలు పడి కోర్టులో కేసులు వేసుకున్న ఇరువర్గాల కక్షిదారులకు ఇదో సువర్ణావకాశమని చెప్పారు. న్యాయవాదుల దగ్గర ఉన్న కేసులకు సంబంధించి కక్షిదారులతో మాట్లాడి కేసులు రాజీ చేసుకుంటే అప్పీలు లేదని, ఇరు వర్గాలు గెలిచినట్లేనని వారికి చెప్పాలన్నారు. సమీక్ష సమావేశంలో ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ ప్రియదర్శిని, నూతక్కి, సీనియర్ న్యాయవాదులు ఐ వెంకట్రావు, ఇంటూరి హనుమంతరావు, ఎం సురేశ్‌బాబు, పీ రమేశ్, జీ అంజిరెడ్డి, బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబూనాయక్

హామీల అమలు సీఎం జగన్‌కే సాధ్యం



లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: ఇచ్చిన హామీలను అమలు చేయటం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. శనివారం మెప్మా ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం చెక్కులను అద్దంకి పట్టణంలోని లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న అక్కచెల్లెమ్మలకు మూడు విడతలుగా ఆసరా నగదును విడుదల చేశారన్నారు. అద్దంకి పట్టణంలో 551 గ్రూపులోని 5436 మంది సభ్యులకు రూ.4.28 కోట్లు అందజేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం డ్రాక్వా గ్రూపు రుణాలు మాఫీ చేస్తానని అక్కచెల్లెమ్మలను మోసం చేసిందన్నారు. అర్హతగల ప్రతి ఒక్కరికి జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. 32 లక్షల మందికి పేదలకు ఇంటి స్థలాలను అందించారన్నారు. కరోనా లాంటి విపత్తులో కూడా వెనకడుగు వేయకుండా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎంగా ఆదరించాలన్నారు. కార్యక్రమంలో తొలుతగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎల్ ఏస్తేరమ్మ, వైస్ చైర్మన్‌లు పద్మేష్, అనంతలక్ష్మీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రవి, కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లా భువనేశ్వరీ, సందిరెడ్డి రమేష్, కాకాని రాధాకృష్ణమూర్తి, కౌన్సిలర్‌లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.



వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ హాజరైన మహిళలు

వైద్యాధికారిపై విచారణ ప్రారంభం



పీహెచ్‌సీలో సిబ్బందిని విచారిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు

వేటపాలెం: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిపై వచ్చిన ఆరోపణలపై బాపట్ల జిల్లా డీఎంహెచ్‌ఓ టీ వెంకటేశ్వరరావు శనివారం విచారణ చేశారు. వేటపాలెం మండలం జెడ్పీటీసీ సభ్యురాలు బండ్ల తిరుమలాదేవి మార్చి 27వ తేదీన వైద్యాధికారి ప్రభాకర్‌రావు తమ విధుల్లో నిర్లక్ష్యంగా, మద్యం తాగి విధులు నిర్వహిస్తున్నారని పలు ఆరోపణలతో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు డీఎంహెచ్‌వో విచారణ చేయడానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. సిబ్బందిని విచారణ చేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కి అందించనున్నట్లు పేర్కొన్నారు. విచారణలో వైద్యాధికారిపై వచ్చిన ఆరోపనలు నిరూపణ జరిగిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వీరి వెంట డీఎంహెచ్‌ఓ కార్యాలయం సూపరిటెండెంట్ టీ మురళీకృష్ణ, అసిస్టెంట్ రమేష్ ఉన్నారు. అయితే జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విచారణ చేయడంపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఏక పక్ష విచారణపై తిరిగి కలెక్టర్‌కి ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

కేజీబీవీ స్కూల్, కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తులు

చినగంజాం: మండల కేంద్రం చినగంజాంలోని కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయంలో పాఠశాల, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రత్యేకాధికారిణి సుమాంజలి ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 2023–24 సంబంధించి ఆన్‌లైన్‌లో పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అని ఆమె తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియెట్‌లో 40 సీట్లు (ఎంపీసీ గ్రూప్, ఇంగ్లీషు మీడియం), 7వ తరగతి 1 సీటు, 8వ తరగతి 1 సీటు మాత్రమే ఖాళీగా ఉన్నాయని ఆమె వివరించారు. ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఃఽఽఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌కు ఏప్రిల్ 20 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

చిరుజల్లులతో రైతుల ఇబ్బందులు



మిరప కల్లాలపై పట్టాలు కప్పుతున్న రైతులు

జే.పంగులూరు: చిరుజల్లులతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మిరపకాయలు కోసి కల్లాలో ఉంచిన కొంతమంది రైతులు, పొగాకు రైతులు, మొక్కజొన్న రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం పంగులూరులో కురిసిన కొద్దిపాటి తుంపర్లకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కల్లాల్లో ఉన్న మిరపకాయలు ఒక చోట చేర్చి పట్టాలు కప్పడంలో నిమగ్నమయ్యారు.

లబ్ధిదారునికి కారు అందజేత



రిబ్బన్ కత్తిరించి కారును ప్రారంభిస్తున్న ఆమంచి

యద్దనపూడి: మండలంలోని యద్దనపూడి గ్రామంలో జగనన్న బడుగు వికాస పథకంలో భాగంగా మంజూరైన కారును లబ్ధిదారుడు వీ కోటేశ్వరరావుకు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ శనివారం అందజేశారు. ఇందులో భాగంగా ఆయన నూతన కారుకు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెల్లేరు రేణుక బాలకోటేశ్వరరావు, కురాకుల ఇసాక్‌బాబు, బండు ప్రకాష్, భూషణం, యద్దనపూడి శామ్యూల్, రావూరి వేణుబాబు, వీరేంద్ర, జే సుబ్బారావు, అంకినీడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అద్దంకి రూరల్: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈఘటన శనివారం రాత్రి అద్దంకి మండలంలో చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని శంఖవరప్పాడు గ్రామానికి చెందిన ఏడుకొండలు కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా స్థానికుల సమాచారంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.